క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 33/11కేవీ సబ్‌స్టేషన్, లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉజ్వల పథకంలో గ్యాస్ కనెక్షన్లు

సత్యవేడు: ఉజ్వల పథకం ద్వారా రేషన్ కార్డు (బియ్యం కార్డు) ఉన్న అర్హులకు స్థానిక భారత్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా నూతనంగా కనెక్షన్లు అందిస్తారని తహసీల్దార్ జరీనాబేగం తెలిపారు. శుక్రవారం భారత్ గ్యాస్ ఏజెన్సీ డీలర్ కృష్ణమూర్తి నాయుడుతో చర్చించామని తెలిపారు. బియ్యం కార్డు దారులు వారిపేరుపై ఇంత వరకు గ్యాస్ కనెక్షన్ తీసుకోని వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు.

బాలాలయ ఏర్పాట్ల పరిశీలన



పనులను పర్యవేక్షిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో ఉన్న పలు దేవాలయాల్లో జరుగుతున్న బాలాలయ ఏర్పాట్లను చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు శుక్రవా రం పరిశీలించారు. పట్టణంలోని ఈటీసీ కేంద్రం వద్ద ఉన్న శివాలయం, వేయిలింగాలకోన లో ఉన్న మార్కండేయతీర్థం, పిట్టలవారి వీధి లో ఉన్న దుర్గమల్లీశ్వరస్వామి, భక్తకన్నప్ప కొండ వద్ద ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో బాలాలయ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆలయాల్లో 17వ తేదీ నుంచి బాలాలయ పూ జలు జరగనున్నట్లు తెలిపారు. ఈలోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

రిజిస్ట్రేషన్ సమస్యలపై వినతి



సబ్ రిజిస్ట్రార్ శోభారాణికి స్పందన జ్ఞాపిక అందిస్తున్న రమేష్

రేణిగుంట: రేణిగుంట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో రిజిస్ట్రేషన్ వినతులను త్వరితగతిన పరిష్కరించాలని రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ ఎం.శోభారాణిని జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఉదయగిరి రమేష్ కోరారు. శుక్రవారం రేణిగుంట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆమెను కలిసి స్పందన జ్ఞాపికను అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ సెల్ కృషి చేస్తోందన్నారు.

శ్రావణ శుక్రవారం పూజలు




నిమ్మకాయల అలంకరణలో పచ్చాలమ్మ

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో శ్రావణ శుక్రవారం పూజలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామదేవతలు పచ్చాలమ్మ, చెంగాళమ్మ, అంకాళమ్మ, అక్కమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పచ్చాలమ్మ దేవాలయ చైర్మన్ నిరంజన్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం

తిరుపతి కల్చరల్: రాస్ సేవా నిలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, అందరూ ఆనందకర జీవితాన్ని గడపాలని సూచించారు. కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ ఉమాపతి మాట్లాడుతూ రాస్ ద్వారా ఆర్థిక క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మిక క్రమ శిక్షణ చక్కగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. అనంతరం మహిళలందరికీ పసుపు, కుంకుమ, చీరలు అందజేశారు.

ఆకట్టుకుంటున్న శ్రీవారి చిత్రం



అలిపిరి నుంచి తిరుమల వెళ్లే నడక మార్గంలోని అక్కగార్ల ఆలయ సమీపంలో 50వ మలుపు వద్ద కొండ బండలపై చిత్రించిన శ్రీవారి చిత్రం భక్తులను ఆకట్టుకుంటోంది. నడిచి వెళ్లే భక్తులు ఆ చిత్రాన్ని ఫొటోలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - తిరుపతి

ఘనంగా అవనాక్షమ్మ గ్రామోత్సవం



పుష్పపల్లకిలో ఊరేగుతున్న అవనాక్షమ్మ



అవనాక్షమ్మ ఆలయంలో ఆదిమూలం

నారాయణవనం: మండలంలోని సముదాయంలో ఉన్న అవనాక్షమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, విశేషాలంకరణ చేశారు. పరిసర గ్రామాల మహిళలు పొంగళ్లు పెట్టి, పిండి దీపాలతో నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం అమ్మవారు మహిషాసురమర్దినిగా పుష్పపల్లకిలో ఊరేగారు. మహిళలు హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయాధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పాల్గొన్నారు.

అవనాక్షమ్మ సేవలో ఎమ్మెల్యే ఆదిమూలం

శుక్రవారం సాయంత్రం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అవనాక్షమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయాధికారి నాగరాజు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, హరినాథరెడ్డి, హేమచంద్రారెడ్డి, అన్నాదొరై, శరవణ, తదితరులు ఉన్నారు.

అక్షరాస్యతా దినోత్సవం



మండలంలోని పాతవీరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు అ అక్షరం ఆకృతిలో కూర్చొని సమాజంలో అక్షరాస్యతపై చైతన్యం రావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుడు దేవరాజులు మాట్లాడుతూ.. అమ్మ ప్రపంచాన్ని పరిచయం చేస్తే అక్షరం అంతరిక్ష శోధన వరకు తీసుకెళుతుందన్నారు. ఉపాధ్యాయులు భువనేశ్వరి, వెంకటేశ్వర్లు, పద్మజ, ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు. - ఏర్పేడు

విద్యార్థి చదువుకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పేద విద్యార్థి చదువుకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. శ్రీకాళహస్తి మండలం వాగివేడుకు చెందిన సాయిసుధీర్‌యాదవ్ ఇంటర్ పూర్తి చేసి ఇంజినీరింగ్‌లో చేరాలనుకున్నాడు. అయితే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఎమ్మెల్యేను ఆశ్రయించారు. స్పందించిన ఆయన శుక్రవారం తన కార్యాలయానికి విద్యార్థిని పిలిపించి సొంత డబ్బు రూ.60వేలు అందజేశారు.

14 నుంచి రేణిగుంటలో గడప గడపకు..



మాట్లాడుతున్న ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి

రేణిగుంట: ఈనెల 14వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు రేణిగుంట పట్టణంలో జరగనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి కోరారు. రేణిగుంట పంచాయతీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సర్పంచ్ నగేషం అధ్యక్షతన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు వేణుగోపాలపురం, వడ్డిమిట్ట, శివకుమార్‌నగర్‌లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేయాలని, రేణిగుంట పట్టణ ప్రజల ఇంటిస్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, రసూల్, పంచాయతీ ఈఓ రవిశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయకస్వామి ఆలయంలో కలశ స్థాపన



ఆలయంలో కలశ స్థాపన

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలోని వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం కుంబాభిషేకం పూజల్లో భాగంగా కలశ స్థాపన జరిగింది. గ్రామస్తులు విరాళాలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో గణపతి, సుబ్రమణ్య స్వామి హోమం నిర్వహించారు. మూడు రోజుల పాటు పూజలు జరుగనున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీ చెంబేటి మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు



బీఎన్‌కండ్రిగ మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

బుచ్చినాయడుకండ్రిగ: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. రోడ్డుకు అడ్డంగా ఆటోవాలాలు వాహనాలను ఉంచుతుండడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువవుతోంది. రోడ్డుపై వాహనాలు నిలిచిపోతున్నాయి. మెయిన్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది.

ఈ సమయాల్లో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుని వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సబ్సిడీపై ఎరువులు అందించాలి



మాట్లాడుతున్న చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి

సత్యవేడు: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై ఎరువులు అందించాలని వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి కోరారు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహాసంఘం సమావేశం ఏర్పాటు చేశారు. పలువురు రైతులు టార్పాలిన్ పట్టలు సబ్సిడీపై అందించాలని, అలాగే జిప్సం, జింక్ సల్ఫేట్ అందించాలని కోరారు. పశు వైద్య శిబిరాలు నిర్వహించాలని చైర్మన్ కోరారు. కార్యక్రమంలో ఏఓ మురళి, వెటర్నటీ డాక్టర్ దయాకర్, ఏఎస్ఓ రాఘవరెడ్డి, సిబ్బంది సర్ణ, మధన్ కుమార్, మురళి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడిగా పార్థసారథి



పార్థసారథి (అధ్యక్షుడు), వెంకటేశ్వర్లు (సెక్రటరీ)

సత్యవేడు: నేషనల్ మజ్దూర్ యూనియన్ ఏపీఎస్ ఆర్టీసీ సత్యవేడు డిపో అధ్యక్షుడిగా పి. పార్థసారథి, సెక్రటరీగా ఎస్. వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. శుక్రవారం సాయంత్రం డిపో సమీపంలోని యూనియన్ ఆఫీసులో రాష్ట్ర కార్యదర్శి ఎం. చెంచులయ్య, జిల్లా కార్యదర్శి బిఎస్. బాబు ఆధ్వర్యంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు నాగరాజు, శేఖర్, డీపీ రవికుమార్, టి. మోహన్, సుధాకర్, యుగంధర్, పోలయ్య, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి సమీపంలో ఉన్న అరుణానది బ్రిడ్జి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతిచెందింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. పిచ్చాటూరు మండలం గజసింగరాజపురం గ్రామానికి చెందిన మహేష్, దేవి(30) సంతల్లో కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నాగలాపురం మండలం సురుటుపల్లిలో జరిగిన సంతలో అంగడి పెట్టారు. రాత్రి 8.30 గంటలకు ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో పిచ్చాటూరు మండలం రామగిరి బ్రిడ్జి వద్ద వెనుకవైపు వస్తున్న లారీ మహేష్, దేవి వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవి లారీ టైరు కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. మహేష్ పక్కకు పడిపోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దేవి నడుము నుంచి కింది భాగం రోడ్డుపై పడగా, పైభాగం టైర్ల కింద చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రెండు భాగాలైన మృతదేహాన్ని గోనె సంచిలో సేకరించి పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడుకు తరలించారు. బ్రిడ్జిపై ప్రమాదం జరగడంతో ఇరువైపులా జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు. లారీ డ్రైవర్ పరారయ్యాడని, లారీని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

గుర్తింపుకార్డుల పంపిణీ

శ్రీకాళహస్తి: ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం డైరీలు, గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన ఉంటోందన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తోందన్నారు.

20 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

తిరుపతి సిటీ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రసాయనశాస్త్ర విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న 20 మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఏటీజీసీ బయోటెక్నాలజీ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ కంపెనీ ప్రతినిధులు ఎస్వీయూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ అభినందించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీవీరెడ్డి ఎస్వీయూ పూర్వ విద్యార్థి కావడం విశేషం.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పట్టణానికి చెందిన 50 మంది యువకులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మరోసారి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని గెలిపించుకుంటామన్నారు. - శ్రీకాళహస్తి

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో త్వరలో చేపట్టనున్న రీ సర్వేతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని, ఇందు కోసం భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా సిద్ధం చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని కంచనపుత్తూరులో భూముల రీసర్వేపై గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం తీసుకొచ్చిందని తెలిపారు. రైతులందరూ భూముల రీసర్వేకు సహకరించాలని కోరారు. అన్ రిజిస్టర్, వంశపారంపర్యం భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామని వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సాగులో ఉన్నవారి పేరుపై పాసు పుస్తకాలు వస్తాయని, ఆన్‌లైన్‌లో వారి పేరు నమోదు అవుతుందన్నారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. కంచనపుత్తూరు గ్రామ రెవెన్యూలో 2,200 ఎకరాల భూమి ఉందని, త్వరలోనే భూముల సర్వే ప్రారంభం అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ స్వప్న, మాజీ సర్పంచ్ గురవయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రవిరెడ్డి, జయచంద్రారెడ్డి, వీఆర్‌ఓ వేంకటేశ్వర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పీహెచ్‌సీ డాక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, వలంటీర్లు చొరవ చూపాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాల నిర్వహణపై మండల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ నుంచి వలంటీర్లు ఇంటింటికి వెళ్లి బ్రోచర్లు అందజేయాలన్నారు. ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి దీర్ఘవ్యాధులతో పాటు గర్భిణులు, బాలింతలు, బరువు లేని పిల్లలు, క్షయ, కుష్టు, మలేరియా, డెంగీ, తదితర వ్యాధులు ఉన్న వారిని గుర్తించాలని ఆదేశించారు. మెరుగైన వైద్యం అందించడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం' అన్నారు. రోగుల వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు జబ్బులు గుర్తించడం, వైద్య శిబిరాలు ఏర్పాటు కోసం మండల పరిధిలో రెండు టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఒక బృందానికి ఎంపీడీఓ, మరో బృందానికి తహసీల్దార్ పర్యవేక్షిస్తారన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ల ద్వారా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాలు విజయవంతం చేద్దామని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ జరీనా బేగం, దాసుకుప్పం, పాండూరు, పీహెచ్‌సీ డాక్టర్లు గుణశేఖర్, లావణ్య, ఎంఈఓ కె.రవి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ బసిరెడ్డి

వరదయ్యపాళెం: అధిక ధరలకు మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పంచాయతీ ఈఓ బసిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వరదయ్యపాళెం పంచాయతీ కార్యాలయంలో చికెన్, మటన్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. వరదయ్యపాళెం మండల కేంద్రంలో మాంసం అధిక ధరలకు విక్రయించడంతో పాటు నాణ్యత లోపిస్తోందని అధిక ఫిర్యాదు వస్తున్నాయని ఈఓ తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా నాణ్యతతో కూడిన మాంసం సమీప ప్రాంతాల్లో విక్రయించే ధరలకే అమ్మకాలు చేపట్టాలని సూచించారు. ఈ విషయమై పంచాయతీ సిబ్బంది, పశువైద్య సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపడుతామన్నారు. సమావేశంలో సర్పంచ్ జ్యోతి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, కో-ఆప్షన్ సభ్యుడు సిద్దిక్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, ఉపసర్పంచ్ చంద్రబాబు, పశువైద్య వైద్యాధికారిణి గౌరి తదితరులు పాల్గొన్నారు.

యాదవుల అభ్యున్నతికి కృషి



ఎంపీ బీద మస్తాన్‌రావును సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

రేణిగుంట: రాష్ట్రంలో యాదవుల అభ్యున్నతికి కృషి చేస్తానని.. వారి సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు యాదవ్ అన్నారు. రేణిగుంటలో శుక్రవారం ఆయన్ను అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నా రామచంద్రయాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అన్బుయాదవ్ తదితరులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. యాదవులకు సముచిత స్థానం కల్పించిన జగనన్నకు అండగా నిలవాలని యాదవ సంఘం నాయకులను కోరారు. యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాబుయాదవ్, రేణిగుంట క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి యాదవ్, అంబియాదవ్, దినకరన్, గౌతం యాదవ్, నాగునాథన్, బాలాజి యాదవ్ తదితరులు ఉన్నారు.

ముక్కంటి ఆలయంలో భద్రతపై సమీక్ష



మాట్లాడుతున్న ఆక్టోపస్ అదనపు ఎస్పీ రామచంద్రమూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం పరిపాలన భవనంలో ఆక్టోపస్ అధికారులు, పాలకమండలి సభ్యులు సమావేశం నిర్వహించారు. ఆక్టోపస్ అదనపు ఎస్పీ కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించనున్నట్లు వివరించారు. డీఎస్పీ చిన్నకొండయ్య మాట్లాడుతూ ముక్కంటి ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న భద్రతా సిబ్బంది తక్కువగా ఉన్నట్లు తెలిపారు. మరికొంతమందిని కేటాయించాలని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. తొక్కిసలాటలు జరగకుండా భక్తులకు సకాలంలో దర్శనం చేయిస్తున్నట్లు వెల్లడించారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో అదనపు సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని సూచించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ అంజూయాదవ్ పాల్గొన్నారు.